క్లుప్తంగా

రంజాన్ ప్రార్థనలో ఎమ్మెల్యే గోపిరెడ్డి



నరసరావుపేట: రంజాన్ పర్వదినాలను పురస్కరించుకొని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పట్టణ, రూరల్ ప్రాంతాల్లోని పలు మసీదులను సోమవారం సందర్శించారు. ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. గుంటూరు రోడ్డు నాయబ్ బజారులోని పెద్ద మసీదు, ఎస్ఆర్‌కేటీ కాలనీ, పనస తోటలో జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొని, శుభాకాంక్షలు తెలిపారు. ఎస్ఆర్‌కేటీ కాలనీలో టీడీపీ నాయకుడు, మాజీ కౌన్సిలర్ షేక్ హస్మత్‌వలికి మంజూరైన పింఛన్ కార్డును అందజేశారు.

భక్తిశ్రద్ధలతో చండీ యాగం



నాదెండ్ల: గణపవరంలో వేంచేసియున్న గ్రామ దేవత పోలేరమ్మ తల్లి దేవాలయ వార్షిక బ్రహోత్సవాలు రెండో రోజు సోమవారం ఘనంగా జరిగాయి. ఉదయం ఆలయంలో చండీ యాగం నిర్వహించారు. మూడు రోజుల ఉత్సవాల్లో వేద పండితులు సోమరాజు గిరిజా నందకుమార్, అందుకూరి మణికంఠశర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యాహ వచనం, మండపారాధన చేశారు. అమ్మవారికి ప్రీతి పాత్రమైన పంచామృతాభిషేకాలు, సుగంధ ద్రవ్య అభిషేకాలు, నవగ్రహ రుద్రాది హోమాలు జరిపించారు. సాయంత్రం అమ్మ వారికి లక్ష మల్లె పూలతో అర్చన గావించారు. మంగళవారం కుంకుమ పూజ, చండీ హోమం, అమ్మవారికి గ్రామోత్సవం, అన్నదానం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యుడు గంగా వాసు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రైతులకు అందుబాటులో డ్రోన్లు

శావల్యాపురం: ఖరీఫ్ సీజన్‌లో ఆధునిక యంత్రాల ద్వారా రైతులు సాగు చేపట్టేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని మండల వ్యవసాయ శాఖ అధికారి రామినేని రామారావు సోమవారం తెలిపారు. తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కారుమంచి, గుంటూరు, వేల్పూరు గ్రామాల నుంచి ఐదుగురు రైతులను ఒక బృందంగా ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఈ బృందానికి రూ.10లక్షలు విలువ చేసే డ్రోన్ అందజేయడం జరుగుతుందన్నారు. ఇందుకు బ్యాంకు రూ.5లక్షల రుణం ఇస్తుందని, బృంద సభ్యుల వాటా 10 శాతం ఉండగా మిగిలిన 40 శాతం రాయితీ ప్రభుత్వం ఇస్తుందని వివరించారు. డ్రోన్ ద్వారా పది నిమిషాల్లో ఎకరం పంటకు ఎరువు, పురుగు మందు పిచికారి చేయొచ్చని చెప్పారు. దీంతో రైతుకు పెట్టుబడి వ్యయం తగ్గుతుందని పేర్కొన్నారు.

ముగ్గురు గైర్హాజరు

నాదెండ్ల: మూడు పరీక్ష కేంద్రాల్లో సోమవారం పదో తరగతి మ్యాథ్స్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. సాతులూరు జెడ్పీ ఉన్నత పాఠశాల కేంద్రంలో ఇద్దరు, చిరుమామిళ్ల నడికట్టు రామిరెడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఒకరు గైర్హాజరయ్యారు. నాదెండ్ల పరీక్ష కేంద్రంలో నూరు శాతం హాజరు నమోదైంది. సాతులూరు పరీక్ష కేంద్రాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్, సత్తెనపల్లి ఎంఈఓ శ్రీనివాసరావు తనిఖీ చేశారు. పోలీసులు మూడు కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. చీఫ్ సూపరింటెండెంట్‌లుగా బొడ్డు శ్రీనివాసరావు, విజయభారతి, జానకీధర్ వ్యవహరించారు.

భక్తిశ్రద్ధలతో వేకువజాము ప్రార్థనలు

చిలకలూరిపేటటౌన్: మానవాళికి శాంతి, ప్రేమ అందించే లక్ష్యంతో ప్రపంచ ప్రార్థన దినోత్సవం నిర్వహిస్తున్నట్లు పాస్టర్ ఎస్ థామస్ చెప్పారు. సోమవారం ప్రపంచ ప్రార్థన దినోత్సవం సందర్భంగా రాగన్నపాలెంలోని యెహోవా యీరే మందిరంలో వేకువజామున ప్రార్థనలు నిర్వహించారు. ప్రపంచ శాంతికే ప్రార్థనే ఆయుధమని ఆయన చెప్పారు. కార్యక్రమంలో పాస్టర్లు ఎంఎస్ మూర్తి, ఎస్.అబ్రహం, బి.రమేష్, సంసోన్, ఎస్.పాల్, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

నేడు అంగన్వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

నాదెండ్ల: అంగన్వాడీ కార్యకర్తల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మంగళవారం నరసరావుపేట కలెక్టరేట్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు సీడీపీఓ శాంత కుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిలకలూరిపేట, నాదెండ్ల, యడ్లపాడు మండలాల్లో ఖాళీగా ఉన్న 7 అంగన్వాడీ కార్యకర్తల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారికి కాల్ లెటర్లు పంపినట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయని, ఎంపికైన వారికి త్వరలో పోస్టింగ్ ఉత్తర్వులు ఇస్తామని పేర్కొన్నారు.

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి

- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- కొత్తపాలెం గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



స్థానికులను ఆప్యాయంగా పలకరించి, కరపత్రం అందజేస్తున్న మంత్రి విడదల రజిని

యడ్లపాడు: సంక్షేమ పథకాలను ప్రజల చెంతకే చేరుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని కోరారు. కొత్తపాలెం గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. బీసీ కాలనీలో ప్రతి ఇంటికీ తిరిగి అవ్వతాతలకు పింఛన్లు, అమ్మ ఒడి, విద్యాదీవెన, ఆసరా, చేయూత డబ్బులు పడుతున్నాయా అంటూ ఆరా తీశారు. ప్రభుత్వ సంక్షేమ లబ్ధిని వివరిస్తూ.. కర పత్రాలను పంపిణీ చేశారు. గ్రామంలోని సమస్యలను మంత్రి ప్రధానంగా తెలుసుకున్నారు. సిమెంట్ రోడ్డు, తాగునీటి పైపులైను ఇలా పలు సమస్యలను స్థానికులు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. ప్రాధాన్యతా క్రమంలో ఆయా సమస్యలను పరిష్కరిస్తామని విడదల రజిని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు గంటా శంకర్, రాచమంటి చింతారావు, కొత్తపాలెం సర్పంచ్ ఎంవీ సుబ్బారావు, ఉప సర్పంచ్ మానం సాంబయ్య, మాజీ సర్పంచ్ గురవయ్య, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్ర ప్రసాద్, వైఎస్ చైర్మన్ ఎం.వీరారెడ్డి పాల్గొన్నారు.

'జగనన్నే మా భవిష్యత్తు'



పథకాలను వివరిస్తున్న జెడ్పీటీసీ ఓబుల్‌రెడ్డి తదితరులు

యడ్లపాడు: లింగారావుపాలెం గ్రామంలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం నిర్వహించారు. గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు గ్రామంలోని ఇంటింటికి వెళ్లారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకురాలు ఆలోకం వెంకటలక్ష్మి నారాయణ ప్రభుత్వ సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. నాయకులు కొల్లా పేరయ్య, నంబూరి బ్రహ్మానందం, విప్పర్ల రామారావు, మద్దు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

- **నాదెండ్ల:** నాదెండ్ల గ్రామంలో సోమవారం 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో కలిసి వైఎస్సార్ సీపీ నాయకులు కె.రామకృష్ణ, చెంచురాజు, కోనేటి నాగయ్య, కాండ్రు శేషయ్య, మిరియాల చిన కోటయ్య, ఎంపీటీసీ సభ్యులు యల్లారావు, ఏసమ్మ తదితరులు పాల్గొన్నారు.
- **రొంపిచర్ల:** మండలంలోని అన్ని గ్రామాల్లో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం సోమవారం కొనసాగింది. సంతగుడిపాడు గ్రామంలో జెడ్పీటీసీ పిల్లి ఓబుల్‌రెడ్డి ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఏ గృహానికి వెళ్లినా జగనన్నే తిరిగి ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఆయన తెలిపారు. మండల సచివాలయాల కన్వీనర్ల సంఘం అధ్యక్షుడు గాదె రామిరెడ్డి, జిల్లా వైఎస్సార్ యువజన విభాగం అధ్యక్షుడు పడాల సాంబశివారెడ్డి, చింతగుంట అంజిరెడ్డి, కాటా రామిరెడ్డి, బత్తుల రామకృష్ణ, ఎలికా శివన్నారాయణ, నలబోతు కోటేశ్వరరావు, చిలికేపల్లి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాంతినికేతన్-రెడ్డినగర్ సీసీ రోడ్డుకు శంకుస్థాపన



నరసరావుపేట: శాంతినికేతన్ బైపాస్ రోడ్డు నుంచి రెడ్డినగర్ వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి శంకుస్థాపన చేశారు. త్వరగా నిర్మాణం పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. జెడ్పీటీసీ సభ్యుడు పదముత్తం చిట్టిబాబు, ఎంపీపీ మొరబోయిన శ్రీనివాసరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పొలం వివాదంలో న్యాయం చేయండి



బొల్లాపల్లి: తమ పొలాన్ని ఆక్రమించి, వేధిస్తున్నారని న్యాయం చేయాలంటూ పమిడిపాడు గ్రామానికి చెందిన మేకల ఏడుకొండలు దంపతులు పల్నాడు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు పి. పొలేష్‌ను సోమవారం కలిసి విన్నవించారు. గ్రామంలోని వీరమాసు గాలెయ్య, చుండూరి వసుంధర దేవి, ఆశా, రవికుమార్, సాయి రోహిత్ చౌదరి, చుండూరి మణిదీప్, కోనేరు శివాజీ తమకు చెందిన గ్రామంలోని సర్వే నెం.488, 489లో గల 10 ఎకరాలను ఆక్రమించి, తప్పుడు ధ్రువపత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించుకొన్నారని వివరించారు. సమస్యను ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు దృష్టికి తీసుకెళ్లి, జిల్లా కలెక్టర్ ద్వారా న్యాయం జరిగేలా కృషి చేస్తానని పొలేష్ సమాధానం ఇచ్చారు.

అన్యాక్రాంత భూముల లెక్కతేల్చాలి



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

యడ్లపాడు: అన్యాక్రాంత ప్రభుత్వ భూముల లెక్క తేల్చి, పేదలకు పంచాలని ఏపీ గిరిజన సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బి.శ్రీను నాయక్ డిమాండ్ చేశారు. వంకాయలపాడు, కారుచోల, కొండవీడు తదితర గ్రామాల్లో వివిధ రాజకీయ పార్టీ నేతలు భూములను అన్యాక్రాంతం చేసినట్లు ఆరోపిస్తూ తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యడ్లపాడు మండలం పరిధిలో సుమారు 150 ఎకరాల ప్రభుత్వ మిగులు భూములున్నాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఉమ్మడి జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన రామాంజనేయులు వెల్లడించారని తెలిపారు. సదరు భూముల వివరాలను నిగ్గుతేల్చాలని డిమాండ్ చేశారు. వారంలోగా సమాధానం చెప్పకుంటే దశల వారీగా ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. అనంతరం కార్యాలయం అధికారికి వినతిని అందజేశారు. ఐక్య వేదిక మండలాధ్యక్షుడు వి.శ్రీనివాసనాయక్, కుంభ నాగేశ్వరరావు, మొగలి తిరుపతిరావు, ఉయ్యాల బలరాం, పాలపర్తి శ్రీనివాసరావు, పాములు నాయక్, యమర్తి సుబ్బారావు, ఏడ్లూరి నాగేశ్వరరావు, హేమంత్ నాయక్ పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడికి దూరంగా ఉండాలి



గర్భిణులకు సూచనలిస్తున్న వైద్యులు

శావల్యాపురం: గర్భిణులు, బాలింతలు మానసిక ఒత్తిడికి దూరంగా ఉండాలని జిల్లా మాతాశిశు సంరక్షణ ప్రత్యేక అధికారి దేవరకొండ నాగపద్మజ పేర్కొన్నారు. సోమవారం ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు పౌష్టికాహారం క్రమం తప్పకుండా తీసుకొని, వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఆమె సూచించారు. ఆరోగ్యశ్రీ పథకం కింద ప్రైవేటు వైద్యశాలల్లో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తారని వివరించారు. సుఖ ప్రసవంపై గర్భిణులు అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. 95 మంది గర్భిణులకు నరసరావుపేటలోని గజ్జెల బ్రహ్మానందరెడ్డి వైద్యశాల ప్రసూతి వైద్యులు జి.కోటేశ్వరి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి సయ్యద్ ఇబ్రహీం, స్టాఫ్ నర్సులు బాలిబోయిన లక్ష్మీ ప్రసన్నకుమారి, ధనలక్ష్మి, ప్రమీల, ఎంఎల్‌హెచ్‌ఓ సంకీర్తన, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమ చొరబాట్లు జరిపితే చర్యలు తప్పవు

తహసీల్దారు రమేష్ కుమార్



మాట్లాడుతున్న తహసీల్దార్ రమేష్ కుమార్, టౌన్ సీఐ టి.బాలకృష్ణ, ఆర్ఐ శ్రీనివాసరావు

మాచర్ల రూరల్: శ్రీకాసు బ్రహ్మానందరెడ్డి డిగ్రీ, జూనియర్ కళాశాల ప్రాంగణంలోని ఖాళీ స్థలాల్లోకి అధికారుల అనుమతి లేకుండా ఎవరైన అక్రమంగా చొరబాటు చేస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ జి రమేష్ కుమార్, టౌన్ సీఐ టి బాలకృష్ణలు హెచ్చరించారు. 1970లో కాలేజీ నిర్మాణానికి 60 ఎకరాలు కేటాయించారని, అందులో 36 ఎకరాలు ప్రభుత్వ భూమి, 24 ఎకరాల పట్టా భూమిని కేటాయించి కాలేజీ నిర్మాణం జరిపారని, ఇందులో కొంత మంది తమకు రిజిస్ట్రేషన్లు ఉన్నాయని చొరబాటు చేసుకుని ఇరు వర్గాల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయని, సంబంధిత వారు సరైన పత్రాలు తమకు అందజేస్తే విచారణ చేపట్టి వారికి తగు న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. ముస్లింలు, వేరే వర్గానికి చెందిన వారు స్థలం విషయంలో గొడవలు పడి రోడ్డు పై ధర్నాలు చేయడం చట్టరీత్యా నేరమని మీ దగ్గరున్న రికార్డులను అందజేస్తే జిల్లా సర్వేయర్‌లతో సర్వే జరిపి సంబంధించిన వారికి భూమిని అందజేస్తామన్నారు. అంతేకాని అక్రమంగా చొరబాట్లు జరిపి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారిపైనైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ కోటేశ్వరరావు, ఆర్ఐ నిమ్మల శ్రీనివాసరావు ఉన్నారు.

సచివాలయ వ్యవస్థ బలోపేతం చేసిన సీఎం జగన్

మాచర్ల రూరల్: సర్వే ఉద్యోగుల సంక్షేమం కోసం రాజీలేని పోరాటం చేసి ఉద్యోగులకు భద్రత కల్పించిన మహనీయుల సేవలు మరువరాదని తహసీల్దార్ జి రమేష్ కుమార్, సర్వే ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి జింకల ఆదినారాయణ అన్నారు. సోమవారం మండలంలోని సర్వే కార్యాలయంలో నేషనల్ సర్వే దినోత్సవం సందర్భంగా ఉద్యోగుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పట్టాభి సీతారామయ్య చిత్రపటానికి నివాళులర్పించి వారు మాట్లాడారు. చాలీ చాలని జీతాలతో కొలువు సాగిస్తున్న వీఆర్‌ఓలకు కనీస వేతనం అందించాలన్న సీతారామయ్య ఉద్యమంతో సర్వే ఉద్యోగులకు భరోసా కల్పించారన్నారు. సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రతి గ్రామానికి సర్వేయర్‌ను నియమించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్వే వ్యవస్థను మరింత బలోపేతం చేశారన్నారు. ఎంపీడీఓ కోటేశ్వరరావు, డిటి బత్తుల వాణి, ఆర్ఐ ఎస్ శ్రీనివాసరావు, సచివాలయ సర్వేయర్లు మునీనాయక్, దుర్గా, చందర్, కోటేశ్వరరావు, రాజు, ఇషానా, సంధ్యా, బాలాజి, అంజి తదితరులున్నారు.

'గురుకులం' ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

చిలకలూరిపేట: రాజాపేట గ్రామంలోని ఏపీ రెసిడెన్షియల్ గురుకుల బాలుర పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డి.ఉషారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5, 6, 7, 8 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి http://aprs.apcfss.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తుల్ని ఈ నెల 24వ తేదీ లోగా సమర్పించాలని తెలిపారు.


నిక్షయ మిత్ర ఫుడ్ బాస్కెట్‌లు పంపిణీ



ఫుడ్ బాస్కెట్‌లు పంపిణీ చేస్తున్న డాక్టర్ ప్రసాద్‌నాయక్, ఎంపీడీఓ

నాదెండ్ల: క్షయ వ్యాధిని వైద్యుల సలహాలతో క్రమం తప్పకుండా మందులు వాడితే పూర్తి నయం చేసుకోవచ్చని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రసాద్ నాయక్ చెప్పారు. గణపవరం పీహెచ్‌సీలో సోమవారం టీబీ బాధితులకు నిక్షయ మిత్ర ఫుడ్ బాస్కెట్‌లను ఎంపీడీఓ షేక్ జాకీర్ హుస్సేన్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దీర్ఘకాలికంగా దగ్గు, గళ్ల పడటం, బరువు తగ్గటం వంటి లక్షణాలుంటే స్థానిక వైద్యశాలలో పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. వ్యాధి నిర్ధారణ అయితే ప్రభుత్వాసుపత్రిలో ఉచితంగా మందులు అందిస్తారని వెల్లడించారు. ఇప్పటికే గుర్తించిన వారికి ప్రతి నెలా ఇంటికి మందులు, పౌష్టికాహారంతో కూడిన ఫుడ్ బాస్కెట్‌లను అందిస్తున్నామన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.

జామియా మసీదు మరమ్మతులకు సాయం



మసీదు కమిటీ సభ్యులకు నగదు చెక్కు అందజేస్తున్న షేక్ జాన్‌సైదా

యడ్లపాడు: రంజాన్ మాసం ధానధర్మాలకు ప్రతీకని జ్ఞానేశ్వర ఫౌండేషన్ చైర్మన్ షేక్ జాన్ సైదా పేర్కొన్నారు. కారుచోల గ్రామంలోని జామియా మసీదు మరమ్మతుల నిమిత్తం ఫౌండేషన్ ద్వారా రూ.50 వేల ఆర్థిక సాయం సోమవారం ఆయన అందజేశారు. కార్యక్రమంలో చల్లా యజ్ఞేశ్వరరెడ్డి, బీవీ రెడ్డి, గొంటు శ్రీనివాసరెడ్డి, అబ్దుల్ రవూఫ్, పోతవరం సర్పంచ్ బాషా, ఆది బాబు, మసీదు కమిటీ సభ్యులు సయ్యద్ మస్తాన్ సాహెబ్, మస్తాన్‌వలి, మౌలాలి, హసన్ షరీఫ్, మహబూబ్ సుభాని, సయ్యద్ కాలేషా, నకరికంటి శ్రీకాంత్, భవనం శివారెడ్డి, కరీమ్ పాల్గొన్నారు.

ఆస్తి వివాదంతో ఇరువురికి గాయాలు

నకరికల్లు: ఆస్థి విషయమై జరిగిన వివాదంలో ఇరువురికి గాయాలైనట్లు ఎస్ఐ పి.సురేష్ సోమవారం తెలిపారు. దేచవరం గ్రామానికి చెందిన కొండా శ్రీనివాసరెడ్డిని అతని తల్లిదండ్రులు సీతారామిరెడ్డి, సామ్రాజ్యం, తమ్ముడు కృష్ణారెడ్డిలు ఆస్థి విషయమై కర్ర, గొడ్డలితో గాయపరిచారు. అడ్డుగా వచ్చిన శ్రీనివాసరెడ్డి భార్య శివకుమారికి గాయాలయ్యాయి. క్షతగాత్రులు నరసరావుపేటలోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్సపొందుతూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆస్తి పన్ను చెల్లింపుదారులకు ఐదు శాతం రిబేట్

సత్తెనపల్లి: పట్టణంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంటి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు ఈ నెల 30వ తేదీ లోపు ఏక మొత్తంగా చెల్లించిన వారికి ఐదు శాతం రిబేట్ అవకాశం ప్రభుత్వం కల్పించిందని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి సోమవారం తెలిపారు. పట్టణంలోని ఇంటి యజమానులు మున్సిపల్ కార్యాలయం లేదా ఆన్‌లైన్‌లో చెల్లించి ఐదు శాతం రిబేట్ పొందాలన్నారు. ఆదివారం, సెలవు దినాల్లో కూడా మున్సిపల్ కార్యాలయంలో కౌంటర్ పని చేస్తుందని తెలిపారు.

రాష్ట్రానికి పట్టిన ఖర్మ చంద్రబాబే : ఎమ్మెల్యే బొల్లా

వినుకొండ అభివృద్ధిపై చర్చకు మాజీ ఎమ్మెల్యే జీవీకి సవాల్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీకి, చంద్రబాబుకే ఖర్మ పట్టిందని.. రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉన్నారని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు రూ.2.30లక్షల కోట్ల అప్పులు చేసి ప్రజల నెత్తిన వేశారని చెప్పారు. రాష్ట్రంలో టీడీపీ మనుగడ కోల్పోతున్న తరుణంలో అల్లర్లు సృష్టించి, రాజకీయ లబ్ధికి పాకులాడుతున్నారని మండిపడ్డారు. రానున్న రోజుల్లో టీడీపీని ప్రజలు భూస్థాపితం చేస్తారని జోస్యం చెప్పారు. పదేళ్లు నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఉన్న జీవీ ఆంజనేయులు వినుకొండ అభివృద్ధిపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. గతంలో బియ్యం, మట్టి, ఇసుక, మద్యం, ల్యాండ్ మాఫియా నడిపింది జీవీ కాదా అని ప్రశ్నించారు. ఇప్పటికీ టీడీపీ నాయకులే బియ్యం అమ్ముకుంటున్నారని ఎద్దేవా చేశారు. సొంత గ్రామాన్ని అభివృద్ధి చేయలేని వారు..తన గ్రామం వేల్పూరును చూడాలన్నారు. వినుకొండలో ముస్లిం మైనార్టీ కళాశాల, హాస్టల్, షాదీఖానా, ఎస్టీ గురుకుల పాఠశాల, వంద పడకల ఆసుపత్రి, కూరగాయల మార్కెట్, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్, గిరి ప్రదక్షిణ రోడ్డు, కొండపై ఘాట్ రోడ్డు నిర్మాణం, ఎన్ఎస్‌పీ కాలువల అభివృద్ధి, మున్సిపల్ స్టేడియం, గ్రంథాలయం, రైతు బజారు, 1వ వార్డు పాఠశాలకు అదనపు తరగతి గదుల నిర్మాణం ఇవన్నీ తన.. హయాంలో జరిగాయని, వినుకొండ అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. జీవీ హయాంలో కొప్పుకొండ, అయ్యన్నపాలెం, ఏబీఎం ఆస్తుల ఆక్రమణ, దాసరిపాలెం, గుమ్మనంపాడు గ్రామాల్లో వందల ఎకరాల భూకబ్జాలకు పాల్పడ్డారని ఆరోపించారు. అక్రమ చేపల చెరువులను ఎవరు చేశారని ప్రశ్నించారు. మిర్చి కుంభకోణం, కృష్ణపట్నం పోర్టులో 7వేల టన్నుల బియ్యం అమ్మింది ఎవరని నిలదీశారు. బయో ఎరువుల పేరుతో రైతులకు మట్టి, ఇసుక అమ్మి, కళ్లజోళ్ల పేరుతో కూడా ప్రజాధనం లూటీ చేసింది ఎవరని దుయ్యబట్టారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ములకా రామతులసిరెడ్డి, జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు గుండాల స్వెనోమ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరాంజనేయస్వామి తిరునాళ్ల



ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు

వినుకొండ(నూజెండ్ల): మదమంచిపాడు గ్రామంలో వెలసియున్న వీరాంజనేయస్వామి తిరునాళ్ల సోమవారం వైభవంగా ప్రారంభమైంది. ఉదయం స్వామివారికి అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరునాళ్ల సందర్భంగా 12 భారీ విద్యుత్ ప్రభలు చేసి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ జక్కిరెడ్డి సుబ్బారెడ్డి, ఈఓ పుణ్యాల వెంకటరెడ్డి, దేవాదాయ శాఖ అధికారులు శ్రీనివాసరెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు ఎం.రాఘవేంద్ర ఆయనకు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం ఘనంగా సత్కరించారు. పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన అన్న సంతర్పణను ఎమ్మెల్యే ప్రారంభించారు. నిర్వాహకులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీలు పగడాల జయశ్రీ వెంకటరామిరెడ్డి, మేడం జయరామిరెడ్డి, జెడ్పీటీసీలు జడ్డా సుబ్బులు రామయ్య, రాజా, వినుకొండ పార్టీ కన్వీనర్ దండు చెన్నయ్య, నూజెండ్ల కన్వీనర్ నక్కా నాగిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్, మాజీ చైర్మన్ గంధం బాలిరెడ్డి, ఎంపీటీసీ వెంకటేశ్వరరెడ్డి, సొసైటీ చైర్మన్ పొట్లపల్లి పిచ్చిరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ షకీలా దస్తగిరి, జెడ్పీ కో-ఆప్షన్ మెంబరు గుండాల స్వెనోమ్, తుమ్మా వెంకటరెడ్డి, ములకా రామతులసి రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా ప్రపత్తి ఆంజనేయస్వామి వార్షికోత్సవం

యడ్లపాడు: యడ్లపాడు మెయిన్ బజారులో చిన్న ఆంజనేయస్వామిగా ప్రసిద్ధి చెందిన ప్రపత్తి వీరాంజనేయస్వామి దేవస్థానం ఏడో వార్షికోత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. స్థానిక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్వామికి అభిషేకాలు, విశేష అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం బయట చలువ పందిరిలో శాంతి కల్యాణం అంగరంగ వైభవంగా చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు నారాయణం హనుమాచార్యులు ఆధ్వర్యంలో కన్నుల పండువలా జరిగిన కల్యాణ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. పలు రకాల ప్రసాద వితరణ, అన్నదానం చేశారు.

నేడు వీరాంజనేయ స్వామి తిరునాళ్ల

శావల్యాపురం: గంటావారిపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ వీరాంజనేయ స్వామి తిరునాళ్ల మంగళవారం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు గ్రామస్తులు విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేశారు. ఎస్సై గల్లా రవికృష్ణ భక్తుల రాక నేపథ్యంలో పటిష్టమైన బందోబస్తుకు చర్యలు తీసుకుంటున్నారు.

మే 13న జాతీయ లోక్ అదాలత్

నరసరావుపేట టౌన్: మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మే 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఓవీ నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదాలత్‌లో రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులతో పాటు సివిల్ కేసులు పరిష్కరించబడతాయని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.